# అశ్రు తర్పణ!

అపర్ణకి పెళ్ళి కుదిరిందని అభినందించడానికి వెళ్ళిన సునీతి అపర్ణ సరిగ్గా మాట్లాడలేదని చిన్న బుచ్చుకుంది. కే.జి. క్లాసునుంచి ఒక్కో తరగతిలో ఒకే బెంచిమీద కూర్చుని చదువుకోవడం, లంచ్ బెల్ లో ఇద్దరూ కలిసి భోంచెయ్యడం దగ్గరినుంచి, బడి ఒదిలి పెట్టాక ఇద్దరూ కలిసి ఇంటికి రావడం వరకూ, ఎవరు ఏ పని చేసినా ఇద్దరూ చెప్పుకుని చర్చించుకుని చేసేవారు. అటువంటి వారి స్నేహాన్ని చూసి అందరూ 'మీరిద్దరూ ట్విన్స్ అయి వుండాలి పూర్వజన్మలో' అనేవారు. బడి ఎగ్గొట్టినా, ఇద్దరూ కలిసి ఎగ్గొట్టేవారు. 'కవల పిల్లలు కనిపించడం లేదే! రాలేదా! అని అడిగేవారు క్లాసులో టీచర్లు, వీళ్ళిద్దరూ ఒక్క రోజు కనబడకపోతే!

అయితే బి.ఎస్.సి. అయిపోయాక, అపర్ణకి చదువు చెప్పించక ఏదో ఉద్యోగం వేయించారు వాళ్ల నాన్నగారు. వాళ్ళ ఆర్థిక స్థితికి ఆ అమ్మాయి ఉద్యోగం చేసి కాస్తో కూస్తో సంపాదిస్తే కట్న కానుకలకి పనికి రావడమే కాకుండా కట్నం కాస్త తక్కువిచ్చుకోవచ్చునని వాళ్ల ఆశ!

సునీతి మాత్రం ఎమ్.ఎస్.సిలో చేరింది. ఆ విధంగా అపర్ణా, సునీతిలు విడిపోయినా అప్పుడప్పుడు కలుసుకుని తనివితీరా మాట్లాడుకునేవారు. అటువంటిది తనతో మాటమాత్రమైనా చెప్పకుండా, పెళ్ళి కుదిరిందని గప్‌చిప్‌గా వున్న అపర్ణని కంగ్రాచ్యులేట్ చేసి, తనకి ముందుగా చెప్పనందుకు దెబ్బలాడి ఒద్దామనుకున్న సునీతి అపర్ణ ప్రవర్తనకి నొచ్చుకుంది. సరిగ్గా మాట్లాడనందుకు బాధపడింది.

"చిన్నప్పటి సన్నిహితత్వం పెరిగాక కూడా అలాగే వుండదమ్మా. అలా అని ఆప్యాయతా, అభిమానం ఎక్కడికీ పోదు. అర్థం చేసుకోవాలి అని తల్లి చెప్పిన ప్రతీమాటలో ఎంతో నిజం వుందని గ్రహించి, ఆ బాధనుంచి విముక్తి పొందింది సునీతి."

సునీతికి కాలేజినుంచి బెంగుళూరు వెళ్లవలసి వచ్చింది ఎడ్యుకేషనల్ టూర్‌మీద ఇరవై రోజులు! ఎలాగైనా ఎగ్గొట్టి అపర్ణ పెళ్లికుండాలన్న పథకం పారలేదు సునీతికి! మనసు లాగుతున్నా చేసేదిలేక వెళ్లిపోయింది.

'శోభనం గదిలో పెళ్లి కూతురు హత్య' తాటికాయల్లాంటి అక్షరాలతో ఎదురుగ్గా పేపర్ పడుంటే తీసి చూసింది సునీతి క్యాంటిన్‌లో కాఫీ తాగుతూ బెంగుళూరులో! గుండె దడదడా కొట్టుకుంది. కాళ్లకింది భూమి బద్దలయినట్టనిపించి, కళ్లు తిరుగుతూంటే, స్నేహితురాలు కిరణ్ ఆధారంగా వెళ్ళి రూంలో మంచంమీద వాలిపోయింది.

శోభనం గదిలో తనని తాకవద్దని భర్తని వారించగా అతడు సరేనని బలవంత పెట్టకుండా ఏ తెల్లవారు జామునో నిద్రపోయాడు. ఆ సమయంలో ఏ మందో మింగి ప్రాణాలు తీసుకుంది అపర్ణ. అందుకు కారణం తానిదివరకే ఎవరినో ప్రేమించిందట! ఆ ప్రేమ విఫలమైంది! ఈ పెళ్ళి నిశ్చయమైంది! అందుకని అలా చేసిందట. ఇదీ ఆ పేపర్లోని వార్త.

"అపర్ణ ఎవరినో ప్రేమించిందా? అది విఫలమైందా? ఇది ఇష్టంలేని పెళ్ళా?" సునీతి పిచ్చిదానిలా పేపరు మళ్ళీ మళ్ళీ చదివింది. "తనకిదంతా మాట మాత్రం కూడా తెలీదే! ఎవరిని ప్రేమించింది? ఆ ప్రేమ ఎందుకు విఫలమైంది? కారణాలేమిటి? ప్రేమించడానికిగల ధైర్యం పరిస్థితుల నెదుర్కోవడానికి లేకపోయిందా? నిజంగా తను ప్రేమించిన వ్యక్తి తననీ అంత గాఢంగా ప్రేమించినట్టయితే ఆ ప్రేమ విఫలమెందుకవుతుంది? కులం, మతం, అంతస్థులూ, ఆస్థులూ, ఇవేవీ పవిత్రమైన ప్రేమముందు, ప్రగాఢమైన ప్రేమ ముందు నిలువలేవే? ఈ కారణాలవల్ల వారి ప్రేమ ఫలించకపోతే! అదసలు ప్రేమేకాదు! దానికోసం తన నిండు నూరేళ్ళ జీవితాన్ని నాశనం చేసుకోవడం ఎంత అవివేకం! నిజమైన ప్రేమికులు, సమాజాన్ని తమ చుట్టూ అల్లుకున్న వారినీ, అన్ని అడ్డంకులనీ కలిసి ఛేదించడానికి సిద్ధపడతాడు. అందులో (ఆడా, మగా) ఏ ఒక్కరు జారుకున్నా, అది నిజమైన ప్రేమేకాదు! దాని కోసం ప్రాణత్యాగం చెయ్యడం మూర్ఖత్వం!

పైగా మరో వ్యక్తితో పెళ్లి నిశ్చయం కాకుండానే, తన నిర్ణయాన్ని తెలియచెయ్యాలి కానీ, పెళ్లయిన తరువాత ఇటువంటి సంఘటనలతో ఆ వ్యక్తిని కూడా ఇబ్బంది పెట్టడం న్యాయమా? నలుగురి నోళ్ళలోనూ పడి, చిత్ర విచిత్రాలుగా, కథలు కథలుగా తమ చరిత్ర, వున్నవీ లేనివీ కల్పించి చెప్పుకోవడం ఎంత అసహ్యంగా వుంటుందో ప్రతీవారూ ప్రాణాలు తీసుకునే ముందు ఒక్కసారి ఆలోచిస్తే ఎంత మంచిది! చచ్చి సాధించేదేముంది? బతికున్న వారిని చిత్రహింస చెయ్యడం తప్పు!

ప్రేమికులూ! మీకు జోహార్లు! ధైర్యంగా మీ ప్రేమని వెల్లడించి, సమాజాన్నీ ఇతర సమస్యలనీ ఎదుర్కొనే స్తోమత వుంటేనే ప్రేమించుకోండి. లేకపోతే ప్రేమలో పడకుండా జాగర్తపడి, పెద్దలకే మీ పెళ్ళి బాధ్యతని ఒదిలెయ్యండి. అంతేగానీ, ఈ ఆత్మహత్యలూ, అవమానాలూ, చిత్రహింసలూ ఏమిటి?" సునీతి మనసు అట్టుడికినట్టు వుడికిపోతోంది!

"అపర్ణా! నీకు, నాకూ మధ్య రహస్యాలు లేవనుకున్నాను. మన స్నేహం చాలా బలమైనదనుకున్నాను. కానీ, ఇదీ పలచనేనని రుజువు చేశావు. నువ్వు ఎవరిని ప్రేమించావో, ఎందుకు నీ ప్రేమ విఫలమైందో, కనీసం ఏ ఒక్కరికి చెప్పుకున్నా పరిష్కారం ఇలా వుండేది కాదు! నీకు ప్రేమించే మనస్సుంది కానీ, ధైర్యంగా నిలిచి ఎదుర్కొనే శక్తి లేదు. ఈ ప్రపంచంలో నీలాంటి వాళ్ళు ఎందరో! అపర్ణా! భగవంతుణ్ణి నీ లాంటి పిరికివాళ్ళని ఇక ముందైనా సృష్టించకు' అని ప్రార్థించడం తప్ప ఏం చెయ్యగలను! ఈ ప్రార్థనే నా అశ్రుతర్పణం! నీకే కాదు నీ లాంటి పిరికివారికి ఇదే నా అశ్రుతర్పణ!"

మంచంమీదపడి వెక్కి వెక్కి ఏడుస్తున్న సునీతిని, ఓదార్చలేక సతమతమయి పోయింది కిరణ్! కాలానికి తెలుసు ఎలా ఓదార్చాలో! గడియారం చూస్తూ కూర్చుంది కిరణ్!

(అపర్ణలాంటి పిరికి వాళ్ళకి ధైర్యం చెప్పాలనీ, ఈ వ్యాసం చదివి ఏ ఒక్కరూ మారినా అది సంతోషమేననే వుద్దేశంతో రాస్తున్నాను) ★